


# బటర్ ఫ్లై ....బటర్ ఫ్లై.. నీలోని బటరెంత

## నగర జీవనశైలిపై ఫోకస్‌లైట్

బటర్ ఫ్లై.... బటర్ఫ్లై... నీలోని బటరెంత?

అతను కలవాళ్ళబ్బాయి. బాగా చదువుకున్నాడు. మంచి ఉద్యోగంలో ఉన్నాడు. అతను చదువుకోవటానికి పెద్దగా కష్టపడలేదు. తండ్రి కావలసినన్ని డబ్బులు పంపేవాడు. "మంచిగా బుద్ధిగా ఉండరా నాన్నా" అనేవాడాయన. తూచా తప్పకుండా పాటించేవాడతను. మంచి బట్టలు, నిగనిగలాడే బుగ్గలు, ఒంటినిండా బోలెడు నెత్తురు, మనస్సు నిండా బోలెడు కోర్కెలు, ఏ రకంగా చూసినా పట్టపగ్గాలు లేకుండా, అచ్చు విడిచిన ఆబోతులా బతికాడతను.

ఇదంతా చదువుకునే రోజుల్లో మాట..

మరో మాటలో చెప్పాలంటే వయసులో ఉన్న కుర్రవాడు ఎంత ఊపులో బతకవచ్చో అంత ఊపుగానూ రోజుల్ని వెళ్ళమార్చాడతను.

విచ్చలవిడిగా సిన్మాలు, పిక్నిక్‌లు, స్కూటర్‌ల మీద పరుగులు, పందాలు తరచుగా కొట్లాటలు అమ్మాయిల్ని ఏడిపించటం (అంత మట్టుకే - అది బుద్ధిమంతుల లక్షణం - అతనూ ఎంతో కొంత బుద్ధిమంతుడే మరి) - ఇలాంటి అన్ని కలాపాలలోనూ, విరివిగానూ, విచ్చలవిడిగానూ పాల్గొన్నాడతను.

తర్వాత ఉద్యోగం!

ఉద్యోగం అతనికి పెద్దగా కష్టపడకుండానే లభించింది. తండ్రి పరపతితోనేమి, అయినవాళ్ళ హోదాల సహకారంతోనేమీ, మొత్తానికి మంచి ఉద్యోగమే లభించింది.

అదృష్టవంతుడతను. నోట్లో బంగారు స్పూనుతో పుట్టినవాడు. చూడటానికి బంగారుబాబు. తండ్రికి బంగారు గుడ్లు పెట్టే బాతు. ఆ బాతును ఎప్పుడు అంగట్లో పెడదామా అని తహతహలాడుతున్నాడాయన. అలాంటి సమయంలో...

అతని పేరు చెప్పనేలేదు కదూ, సురేష్ - సురేష్‌కి ఇంటివద్ద లక్షల కట్నంతో వచ్చే అమ్మాయికోసం వెతుకుతున్నారు. అతను మాత్రం ఇక్కడ ఒంటరిగా, ఉద్యోగం చేసుకుంటూ సాయంత్రాలు సినిమాహాళ్ళలోనూ, టాంక్‌బండ్ మీదా, సుల్తాన్‌బజారు ఇరుకులోనూ తోచక తిరుగుతున్నవేళ - ఒకానొకరోజు -

రాత్రి ఎనిమిది దాటిన తరువాత-

సుల్తాన్ బజారులో -

ఆమె పరిచయమైయింది.

ఎరుపు నలుపుల సమ్మిళిత వర్ణంలో ఉందామె. మధ్యరకం ఎత్తులో ఉంది. నునుపాటి మెడతో ఉంది. గుచ్చుకునే కళ్ళు కలిగి ఉంది. హత్తుకోవాలనిపించే ఛాతీ కలిగి ఉంది.

అతడు రోడ్డు మీద బండిపైన బ్యాగుల్ని ఖరీదు చేస్తున్నవేళ -

ఆమె వచ్చి అతని పక్కనే నిలబడింది.

తను కూడా ఈ సంచినీ ఆ సంచినీ వెతుకుతూ అనుకోకుండానో కావాలనో అతనికి ఆనుకున్నట్టు నిలబడింది. ఆమె భుజం అతని

జబ్బుకు తగుల్తోంది. వొత్తుకుంటోంది.

ఇదేమిటా అని పక్కకు చూసేసరికి ఆమె కూడా అదే సమయాన అతని వేపు చూసింది.

తెలుగు సినిమాలలోలా, తెలుగు ఆడపిల్లల కలల్లోలా ఇద్దరి కళ్ళూ కలుసుకున్నాయి.

ఆమె కళ్ళు వాల్చేసుకుంది.

అతను చూపులు మరల్చుకున్నాడు.

తర్వాత ఆమె ఒక సంచి తీసుకుని అక్కణ్ణుంచీ కదిలిపోయింది.

కొద్ది దూరం పోయాక ఆమె వెనక్కు చూసేసరికి అతను తన వెనకే నడుస్తున్నాడు.

"మీరు నా వెంట బడుతున్నారు", అందామె.

"లేదు, వెనక నడుస్తున్నాను", అన్నాడతను.

కిసుక్కుమందామె.

"భలే మాట్లాడతారే" అంది.

"ఇంకా పూర్తిగా మాట్లాడందే" అన్నాడతను.

"మీరు వెనుక నడుస్తుంటే మీరెవరో చెడ్డవాళ్ళలా ఉన్నారు అనుకున్నాను" అందామె.

"మీరు ముందు నడుస్తుంటే భలే అందంగా ఉన్నారే అనుకున్నాను" అన్నాడతను.

ఇద్దరూ కిసుకు కిసుకుమని నవ్వుకున్నారు.

అలా మొదలయింది వాళ్ళ స్నేహం! ఆ తర్వాత వాళ్ళు చాలాచోట్ల చాలా వేళలలో కలుసుకున్నారు. హృదయాలూ శరీరాలూ చేరువయాయి. ఆ రెంటికీ చాలా అవినాభావ సంబంధం ఉంది... హృదయం మార్కు బొమ్మకీ, స్త్రీ శరీరంలో ఏదో భాగానికీ సారూప్యత కనిపిస్తుంటుంది కదండీ... సరే, సరే..

ఆమె అతనుంటున్న గదికి వచ్చిపోతుంది.

"నేను చాలా పేదదాన్ని" అందామె ఒకసారి.

నవ్వాడతను.

ఆ రాత్రి అతనికి తన దేహాన్ని అర్పించిందామె. అదయాక ఏడవడం మొదలెట్టింది.

"ఎందుకు ఏడుస్తున్నావు," అన్నాడతను.

ఎందుకో చెప్పకుండా ఆమె ఏడుపును ఇంకాస్త ఎక్కువ చేసింది.

"నిన్ను పెళ్ళి చేసుకోనని భయమా" అన్నాడతను.

కాదందామె.

"మరెందుకు" అన్నాడతను.

ఇంటివద్ద తల్లి జబ్బుతో పడి ఉందనీ, మందులు కొనటానికి డబ్బులు లేవనీ అది గుర్తొచ్చి ఏడుస్తున్నాననీ అందామె.

"ఎంత కావాలి?" అన్నాడతను.

"ఆరువందలు" అందామె.

జేబులోంచి ఆరువందలని తీసి ఆమెకిచ్చాడతను. ఆ క్రితం రోజే జీతం అందుకున్నాడు.

మొదట ఆమె తిరస్కరించింది. ఆ తర్వాత ఎలాగైతేనేం తీసుకుంది.

అప్పట్నించీ వాళ్ళిద్దరి మధ్యా అనుబంధం మరింత పెరిగింది. నాలుగయిదు రోజులకు ఒకసారి ఆమె అతని వద్దకు వస్తుంది. ఇద్దరూ కలిసి సినిమాకి వెళ్తారు. హోటేలుకు వెళ్తారు 'యాంకీ జాంకీ'కి వెళ్తారు.

ఖర్చే ఖర్చు! మొత్తాన్నీ అతనే భరిస్తాడు. (ఆమె పేదది కదండీ పాపం!)

ఒకోసారి ఆమెను "శారీప్లాజా"కి తీసుకువెళతాడు. మంచి శారీ కొంటాడు. పర్సు సగం ఖాళీ అవుతుంది.

'నా(రాజాగా' అంటూ మత్తుగా మెరుపు కళ్ళతో చూస్తుందామె.

కూసింత సేపు స్వర్గంలో విహరించి వస్తాడతను.

అలా అలా ఓ ఆర్నెల్లు గడిచాయి. ఓరోజతను నీ అభిమాన క్రికెటరు ఎవరు అని అడిగాడామెను. "ధోనీ" అందామె. నీ అభిమాన హీరో ఎవరు అన్నాడు. "షారూక్‌ఖాన్" అందామె. నీ అభిమాన రాజకీయ నాయకుడెవరు అన్నాడు. "బిల్‌క్లింటన్" అందామె.

"అయితే నువ్వు నీ స్వయంవరాన్ని ప్రకటించావనుకుందాము. ఆ ముగ్గురూ నాతోపాటు ఆ సభకు హాజరయితే ఎవరి మెడలో దండ వేస్తావు" అన్నాడతను.

"ముందు నీ మూతి మీద ముద్దు పెట్టుకుంటాను," అందామె.

"తర్వాత"? అన్నాడతను-

"కొత్త చెప్పు తీసుకుని ఆ ముగ్గురినీ మూతిపళ్ళు రాలగొడతాను"అందామె

"అదేమిటీ" అన్నాడతను.

"లేకపోతే నా ప్రియుడు నాకుండగా వాళ్ళెవరు మధ్యలో రావటానికి" అందామె. ఆమె మాటలకు అతనికి ఎంతో సంతోషం వేసింది. కానీ...

ఆమె సన్నిధానం అతనికి స్వర్గధామంగానే అనిపించినా ఆ సంతోషం ఎక్కువ సేపు నిలవటం లేదు. ఆమె వెళ్ళీ వెళ్ళగానే అతనికి డబ్బు లోటు కొట్టొచ్చినట్టు ఎదురుగా నిలబడి ప్రశ్నిస్తోంది. ఇరవై వేల జీతమూ అతనికిప్పుడు చాలటం లేదు. ఆమె దగ్గర ఉన్నంత సేపూ ఏదో ఓ నెపాన డబ్బులు విచ్చలవిడిగా ఖర్చయిపోతున్నాయి. ఇంటివద్ద మందులకని వాటికనీ ఆమె కొంత కొంత రొక్కాన్ని పట్టుకుపోతుంది.

అసలు ఆమె ప్రేమ సిసలయిందేనా??

ఈ మధ్య ఈ సందేహం ఒకటి అతనిలో ప్రవేశించి అతడిని నమిలేయసాగింది. ఆమె తన వద్ద ఉన్నంత సేపూ అది "సిసలు ప్రేమ"గా కనిపిస్తుంది. కానీ ఆమె వెళ్ళగానే మాత్రం అతనిలో సందేహాన్ని ప్రవేశపెడుతుంది. అందుకు కొన్ని కారణాలున్నాయి.....

సరిగ్గా జీతాలందిన రోజున ఆమె ఏదో వంకన వస్తుంది. అతనితో లవ్వాట ఆడుతుంది. తర్వాత డబ్బులు పట్టుకు పోతుంది. ఆమె చెప్పే కారణాలన్నీ ఆ క్షణాన కూడా సహేతుకంగానే తోస్తాయి. "ఏది సత్యం, ఏది అసత్యం ఓ మహాత్మా" అంటూ పెద్దగా అతనికి అరవాలనిపిస్తుంటుంది.

క్రమంగా అతనూ అబద్ధాలకు అలవాటు పడ్డాడు. ఏదో వంకన ఆమెకు డబ్బులివ్వటం మానేశాడు. ఖర్చులూ తగ్గించాడు. ఇదంతా ఆమె ప్రేమను పరీక్షించటానికి.

నెల గడిచింది. రెండు నెలలగడిచాయి. మూడు నెలలు గడిచాయి.

ఇప్పుడామె అతని వద్దకు అంతగా రావటం లేదు. వచ్చినా హృదయపూర్తిగా మాట్లాడటం లేదు.

నాలుగోనెలలో గావును ఓ రోజు ఆమె స్కూటరు మీద మరెవరో యువకుడి వెనక కూర్చుని పోతూ కనిపించింది.

ఇదంతా చానాళ్ళక్రితం మాట...

ఇప్పుడు సురేష్‌కి మ్యారేజ్ అయింది. బోలెడు కట్నం వచ్చింది. పెళ్ళాం ఇద్దరు పిల్లలను పెట్టింది. జీవితంలో ఏమీ ట్రాజెడీ జరగనట్లే

అతను మామూలుగా సంతోషంగా కనిపిస్తున్నాడు. అప్పుడొకసారీ, ఇప్పుడొకసారీ ఆఫీసులో స్టెనోతోనో మరో అమ్మాయితోనో పార్కులోనే సినిమాహాల్లోనో కనిపిస్తున్నాడు. మరో బటర్ఫ్లైగా మారాడతనిప్పుడు.

ఇలాంటి బటర్ఫ్లైగాళ్ళను, బటర్ఫ్లైగత్తెలనూ చూసినప్పుడు మాత్రం నాకిలా కృశ్ఛనించాలనిపిస్తుంది.

"బట్ర్ ఫ్లై బటర్ ఫ్లై నీలోని బటరెంతా??

ఒకవేళ వాళ్ళే కనక హృదయం విప్పి మాట్లాడదల్చుకుంటే....

"ఒరేయ్ వెర్రి వెధవా నీలో నిజాయితీ అంతరా"

అని అంటారేమోనని భయమూ కలుగుతుంటుంది...!

